# అనగనగా ఒక భావం

ANAGANAGA OKA BHAAVAM

సద పంగ

# కవిత్వంలో నేను...

మూడు సంవత్సరాలనుంచి రాస్తున్న కవితలు నాలో ఉన్న కొత్త మనిషిని పరిచయం చేసాయి. నాకొక మంచి గుర్తింపు తెచ్చుకోవాలనే ఆశతో మొదలుపెట్టినా, ఇప్పుడు అవే నాకు అడుగులు నేర్పుతున్నట్టున్నాయి. కొన్ని రోజులకు **డా॥ ఎన్. గోపి గారు** రాసిన కొన్ని పుస్తకాలు చదివాను. తర్వాత ఆయన రాసిన గ్రంథాలన్ని చదివాను. ఏదో కొత్త లోకంలో నేను ప్రవేశించినట్టు అనిపించింది. తర్వాత కొన్నిరోజులకి వెళ్ళి ఆయనను కలిసాను. ఆ తర్వాతే కవిత్వం ఒక తీరని దాహమని అర్థం చేసుకున్నాను.

కొన్ని రోజుల్లో నాకంటూ ఒక శైలిని ఏర్పర్చుకున్నాను. అందులో ప్రపంచాన్ని చూపిద్దాం చదువరులకు అనుకున్నా. రాసిన కవిత్వాలన్నీ హృదయానికి స్పందన కలిగించేలా రాయాలి అనే అంశాన్ని దృష్టిలో పెట్టుకొని రాసాను. నా మొదటి ప్రచురణ (మొదటి కవితా సంపుటి) ఇది. ఎంతో ప్రోత్సాహంతో జరిగింది ఈ ప్రచురణ. ఇందుకు మొదట కారణం, మా కాలేజిలో ఇంగ్లీషు డిపార్టుమెంటులో పనిచేస్తున్న **డా॥ కె. సంధ్యా దీప్తి గారు.** చాలా శ్రమతో కూడుకున్న పని అయినా, సులువుగా చేసారు. అందుకు మేడం గారికి జీవితాంతం ఋణపడి ఉంటాను.

కవితలు రాయడం మొదలు పెట్టినప్పటి నుండి, ఏ కవితా సంపుటి చదివినా నేను అందులో లీనం అయిపోతాను. అవి నాకు మాత్రమే అర్థం అయ్యేలా, నా కోసమే రాసినట్టు అనిపిస్తాయి. కొంతమంది కవితలు చదివి చాలా నేర్చుకున్నాను. నిజంగా ఈ మూడేళ్ళ జీవితం కవిత్వంలో నేను లీనం అయిపోయాను. నేనే కవిత్వం అయ్యాను. దేహం మొత్తం కవిత్వంలో నింపేసాను. వర్ణనలో వాస్తవాలని తెలిపాను. కళ్ళని అన్నింటినీ ఆకర్షించేలా కాలంతో పాటు మారిన పరిస్థితులని, మనుషుల హావభావాలని, మానవత్వాన్ని నా కవిత్వంలో చిత్రీకరించాను.

చిన్న ప్రయత్నమే, పెద్ద ఖ్యాతి. బలగం చిన్నదే, బలం పెద్దది. ఎక్కడికో అర్థంలేని పరుగు అనుకున్నా. కానీ, ఇప్పుడు తెలిసింది, ఆ ప్రవాహం నాలోకి నేనే అని, నా కవిత్వంలో నేనే అని. కవిత్వం ఒక తీరని దాహం అని, అందులో నేనే దాహం తీర్చే దాతని అని.

– పంగ సద

అనగనగా ఒక భావం

# విషయ సూచిక


| | పేజి నం. |
|---|---|
| అనగనగా ఒక భావం | 1 |
| కథనం | 2 |
| ముఖ్య అతిథి | 3 |
| ఏ రంగు? | 4 |
| నిరీక్షణ | 5 |
| నా వర్ణన నీ కోసమే | 6 |
| మారిన మనిషి | 7 |
| నెత్తురు గీతం | 8 |
| మెలి తిరిగివన మనసు | 9 |
| అగణితం | 10 |
| మానవత్వం ఓడిపోయింది | 11 |
| ఈ వేళలో | 12 |
| నా కవిత్వం | 13 |
| స్నేహ బంధం | 14 |
| వాస్తవం | 15 |
| అస్థిత్వం | 16 |
| పదిలం | 17 |
| నడుస్తున్న కథ | 18 |
| వేమన నిలయం | 19 |
| కలవరం | 20 |
| రవికిరణం | 21 |
| ఎంత మంచివారండి మీరు | 22 |
| అంతా మరిచాడు | 23 |
| చేజారిన గుండెలు | 24 |
| ఏమోయ్ | 25 |

# విషయ సూచిక


| | పేజి నం. |
|---|---|
| జీవన గీతం | 26 |
| ఆమె శేషం కాదు | 27 |
| పాడెపై నిద్ర | 28 |
| స్వార్థపు నీడ | 29 |
| అనిద్ర | 30 |
| సమాధి స్థలం | 31 |
| రైతన్నా | 32 |
| నా పాట | 33 |
| పునాది | 34 |
| కాకా! కాకా! | 35 |
| నవ సమాజం | 36 |
| పాలేరు | 37 |
| డిజిటల్ ప్రపంచం | 38 |
| నా జీవితమిక్కడే | 39 |
| కాకతాళీయం | 40 |
| ఏకాకి | 41 |
| పాంచజన్యం | 42 |
| నిజమే | 43 |
| కాలుక్యులేషన్ | 44 |
| శేషం | 45 |
| రోప్ వే | 46 |
| నా కవిత్వం | 47 |
| మార్పు | 48 |
| మనుజుడు | 49 |
| ఆమె చూపు | 50 |

# అనగనగా ఒక భావం

అనగనగా ఒక భావం,

తనకి నవ్వటం వచ్చు, నవ్వించటం వచ్చు.

ఎన్ని వచ్చినా ఏం లాభం?

నిస్సహాయత పాలైతే, ఎన్ని నేర్చినా ఏం ఫాయిదా?

అన్నీ దూదిపింజలై ఎగిరి నింగినందుకుంటే,

ఆ భావానికొచ్చిన రాగం నేడు సైగల్ పాటలా లేదు,

చిరునవ్వులు చిందించే చిన్నారి నవ్వుని

ఎవరో కాజేసినట్టుంది.

అర్థం తెలియని మాటలు

విజయ గర్వంతో తలెత్తి నిలదీస్తున్నాయి.

అది ఎగతాళో మరి కరుణా రసమో

మరి ఏదైతే ఏంటి?

ఎన్ని చేసినా,

ఆ భారాన్ని మోసే తాహతు ఆ భావానికి లేదు.

# కథనం

కథ రాస్తున్నా...
కథనం పేరు 'గాయం'
గాయం గుర్తే, గమ్యం గుర్తే,
గుర్తులు అన్నీ చేరదీసినా
గాయం ఆగదు.
రక్తం వరదలై పారినా,
రాకాసి రాజ్యం రత్నాలు అంటుంది.
'గాయంలో' అక్షరాలు
అతలాకుతలం అయినా,
అంతెత్తు లేచే ఆది కావ్యం,
అక్షరాలా నిర్దాక్షిణ్యంగా
నిలబడిపోయింది.
కారణాలు అనేకం కానీ
కథనం మాత్రం గాయమే.
గాయం ఎక్కడా?
గుండెకు హత్తుకునే
మనస్తత్వానికి మరి,
చెరిపేయలేం! ఆ కుట్ర
నాకిప్పుడే తెలిసింది.
అదే...నేను రాసింది.
కథ కాదు, కవిత్వం.

# ముఖ్య అతిథి

ఆదరా బాదరా పిలుపులతో
అలజడి గట్టిగానే జరిగింది
శ్వాసతో సంబంధం లేని
సంకేతాలు అన్నీ ఏకాంతాలుగా
సమావేశం నేడు.
ఒక ముఖ్య సన్నివేశం
ఈసడించి, ఈసడించి
ఇప్పుడే ఇగురులోకి
తొంగి చూస్తుంది.
అలికిడి విరాళ రూపంగా
విహరిస్తుంది.
నీ దవడ కింద నలిగే
ఈ వ్యవస్థ విషపు కోరలు
విరిచే ఘనుడు వీహంగం
సృష్టిస్తున్నాడు.
ఉచ్ఛరణకి నోచుకోలేదు,
ఉలికిపాట్లకి మాత్రమే కాస్త
నొచ్చుకున్నాడు.
నేడు అతడికి ఘనస్వాగతం
పలికినా, ఆదరించే స్థితిలో
అతడు లేడు.
శబ్దాన్ని ఎరుగని లోకంలో
ఎప్పుడో జెండా ఎత్తేశాడు.
ఎంత చేసినా,
ఈ ముఖ్య సన్నివేశానికి,
ముఖ్య అతిథి అతడే!

# ఏ రంగు?

మబ్బుకైతే మనసు
మసిబారినప్పుడల్లా మేఘం
కాలావతారం ధరిస్తుంది.
కళావిహీనం అయినా,
కారు మబ్బులు నీలి గగనానికి
ఆభరణమే.
ఇదంతా ఎందుకంటావా?
కొంచెం కన్ఫ్యూజన్
కాస్త కన్ఫర్మేషన్ కావాలి.
కొన్ని రోజులు ఆగండి.
రక్త సంద్రంలో చేపలు
వేటకు వెళతాయి.
చోటూ, మోటులే కాదు
చిన్న కీటకం దూరినా,
దుమారమే.
అయితే చెప్పు, ఇప్పుడు
నీ మనసు ఏ రంగులో
మునిగిందో...?
నాది విశాలహృదయం,
అన్నీ నాలో సగం.
ఊహలకైనా, ఊసులకైనా
ఆవాసం నేనే కదా.

# నిరీక్షణ

అనుకున్నదంతా కాళ్ళ
ముందు పరుచుకున్నప్పుడే
నా నిరీక్షణకు విరామం.
కెరటమై లేచిన కడలి
నీటిలో కలిసిపోవొచ్చు.
నిరీక్షణ నింగిలో
లీనమౌతుండొచ్చు.
పిచ్చి శూన్యమా!
యాతనలను మించిన యాది నాది
అదీ నిరీక్షణ వైపే.
ఈ లోకానికి గంపెడు
అక్షరాలు చల్లుతాను
ఆశయాలు అవుతాయో!
అవమానాలు అవుతాయో!
ఎప్పుడో అమ్మ ఒడిని విడిచి
చదువులచెంతన చేరాను.
నిరంతర నిరీక్షణ కడలిలో
వేగుతుంటే, కంటిలో కనబడేది
నే విడిచిన అక్షరాలే.
ఇది నా నిర్జీవ జీవనయాత్ర.
ఈ యాత్రలో నేనెక్కడికి
అడుగులు వేస్తున్నానో?
బహుశా నాలోకి నేనేనేమో!

# నా వర్ణన నీ కోసమే...

ఎంత చక్కగా ఉన్నావు
అమ్మాయి!
అందం అంతరంగంగానా?
బాహ్యంగానా?
మాటలు ముత్యాలట,
నవ్వులు సంపదలట,
నీకూ నాకు మధ్య బేధం
ఏంటో తెలుసా!?
తెలిసినా నీతో నే సరితూగనులే!
సుమధురమైన సహజత్వం,
సరళత్వం.
అరె! ఎంతని వర్ణించను
నీ గురించి.
పాదాలకు పదాలు జతచేసి
పరుగులు నేర్పాను నీకోసం.
ఆశలకు ఎప్పుడో
ఆనకట్ట కట్టేసాను.
ఓ పడతి!
నువ్వు నాకన్నా చిన్నదానివే.
ఆశయాలవైపు పరిగెడుతున్నావు.
అందరి దృష్టి నీపైనే ఉంది.
ఆకర్షించావో, ఆక్రమించావో మరి?
నిజంగా, ఎంత లక్షణంగా
ఉన్నావమ్మాయి.
ఇకపై నేను వర్ణిస్తాను.
ఈ పై, నీ వర్ణనకై శబ్దాలను
పుట్టించుకొస్తాను.
నా కవిత్వంలో నిన్ను చూపిస్తాను.

# మారిన మనిషి

కొత్త మానసిక తెరలు దించాడు
కొత్త వేదాంతాన్ని ప్రకటించాడు
తప్పు అతనిది కాకపోవొచ్చు,
కానీ, తాను మాత్రం దోషి.
ఇకపై అతడికి మాటలు లేవు.
పదబంధాలతో మాటలు పాటలుగా
పాడుతాడు, అంతే.
బరువులు మోసి అలసిన జీవితం,
బాధ్యతలను నేర్పడానికి
భవబంధాలను తెంపుకున్నాడు.
అన్నీ మీకోసమే!
ద్రోహం చేసారుగా నీకు
వారిని నమ్మకు.
ప్రాలాపనలు ఇకపై చాలించు.
జీవిత శిధిలాల్లో ఏమీ మిగలవు,
ప్రస్థావించడానికి.

# నెత్తురు గీతం

జలపాతంగా మారిన ఒక మహానది
నిదానంగా వెళ్తుంది.
జీవనదిగా మారిన కళ్ళు కాస్త
విశ్రాంతి తీసుకుంటున్నాయి.
నయనముల నుంచి
తారలు ప్రకాశిస్తున్నాయి.
పాలల్లో విషపు చుక్కలు కలిసిన
వైనాన్ని ఆరాతీస్తున్నాయి.
నీటిధారలని చూసి జాలిగుండె అనుకున్నా,
ఆ జాలిగుండెకు ముళ్ళుగుచ్చాయి.
అందుకే ఈ జలగీతం కాస్త
నెత్తురు గీతం అవుతుంది.
చాచిన బాహువులు గుండెలు చీల్చితే,
చీల్చిన పాయలతువ్వాళ్ళతో
ఆ నెత్తురిని కాస్త తుడిచాయంటే
వాటికింక జయహారతి పట్టాల్సిందే.
వాటికి ఇకపై చైతన్య చికిత్స అక్కర లేదు.

# మెలి తిరిగిన మనసు

శబ్దం, నిశ్శబ్దం,
ఏకాంతం, సమూహం
వ్యతిరేకాలు కాదు
పడమటి గాలులతో అల్లుకున్న
పర్యాయాలు, పసితనపు అడుగులు,
సపర్యలు నేర్పిన సందిగ్ధాలు.
మేధావి వర్గం అంతా కలిసి
వెలివేసిన చిన్ని-చిన్ని నవ్వుల
చిరు చిహ్నాలు.
వర్ణన బాగుందండి.
కానీ, బాధ ఇంకా బంధీగానే ఉందండి
సంకెళ్ళెవరు వేసారు?
పిసినారి లోకానివా?
పిరికి శరీరానివా?
నావే..., అంటే...?
పరుగులు తీసి అలసిన
ప్రశ్నార్థకానివి.
అక్షరాలా మూడు మాసాలు,
మెలితిరిగిన మనసు
మంచు చుక్కలా జారుతుంది.
కంచు రవళి కూడా శూన్యపు
జాడల్లో నడుస్తుంది.

సద పంగ

# అగణితం

పేరుకే సదువుకున్నోడు
దొరగాడి గొడ్ల లెక్కకు మించి గణితం రాదు.
అమ్మో! వాన్ని నమ్మొద్దు
వెయ్యికళ్ళ అంధత్వం అతనిది.
ఎక్కడ్నుంచో వచ్చి దారి తప్పాడు.
దూరాలలో మారిపోయినవి,
అతడు మర్చిపోయినవి ఎన్నో
అక్కడ కిరణాలయ్యాయి.
పరిచితులను, అపరిచితులను
అందరిని ఆదమరుస్తాడు.
అతన్ని నమ్మొద్దు.
కులం, యువకులం అని చెప్పుకున్నా,
బలం అనిశ్చయమే.
నీరెండను కప్పుకున్నా,
కన్నీళ్ళ ఋతువు మాత్రమే
అతనికి సొంతం.
చరిత్రలు చదివిన కంఠం,
చేతులకు మాత్రం చేదోడు కోసం
చేయి చాచాడు.
పేరుకే సదువుకొన్నోడు.

# మానవత్వం ఓడిపోయింది!

నేను నిజంగానే మానవత్వం ఓడిపోయిందంటాను,
హరిత స్వప్నాలే చెట్లకు ఫలహారం అంటాను.
వాడిపోయె ఆకులను చూసి చెట్లు అల్లాడతాయి కానీ,
భూమిని ఆడిపోసుకోవు.
అది మానవత్వం కాదు చెట్లతత్వం.
మానవత్వం కెమెరాల్లోనే శిరస్సు పైకి లేపేది.
అసహ్యంగా నడుస్తున్న చరిత్ర
దీనికి నాంది పలికింది.
ఇంకేముంది, నేను అన్నీ భావాలను
తుడిపేసేందుకు పూనుకున్నాను.
అహంభావంతో సహా.
చీకటి చిక్కనైతే,
నేడు మానవత్వం మంచి నాటకం వేస్తుంది.
పేరు జీవనరాగం,
నేను ఇకపై ఆ నాటకాన్ని చూడలేను.
తెరదించండి.

# ఈవేళలో

ఇదే ఒక జీవం,
జీవనరాగం పాడిన వేళ.
తప్పటడుగులు తప్పులు అని తెలిసినా,
తప్పనిసరి అయిన వేళ.
ఈ వేళ, రాటు తేలిన శిల్పం కళ్ళల్లో
కన్నీరు వర్షంలా కురిసింది.
ఆశయాన్ని అధిగమించిన ఆటగాడి,
గుండె చప్పుడు ఆగిన వేళ.
వినికిడి కూడా వనుకుడుగా,
మార్చేసిన తరుణం చేతుల్ని కట్టిపడేసింది.
నేను ఏం చేయను?
చాతకాని దానిలాగా నడి రోడ్డుపైన
వింత ప్రపంచాన్ని కునులారా తిలకించడం తప్ప.
కళ్ళు ఎన్ని కలలను ఎదురించాయో తెలియదు
కనురెప్పలు మాత్రం
అన్నింటినీ తనలో దాచుకోవడం నేర్చింది.
నాకు తెలియని రేపటి కొత్త ప్రపంచాన్ని
పరిచయం చేసి, గొంతు నులిపేసింది.
ఈ వేళ, అభ్యున్నతి కాస్త అధోగతి పాలైంది.

# నా కవిత్వం

అది కాలం అయితే ఏంటి?
కవిత్వం ముందు అన్నీ బలాదూర్.
లోకానికి నేను కొన్ని
కలల కాంతులు అప్పుగా ఉన్నాను.
గుప్పెడు అక్షరాలను పట్టుకొని
ప్రయాణం ప్రారంభించా
మెట్టప్రాంతాల్లో మట్టెల రవళికి
కవిత్వం ఎగిసిపడుతుంది.
అలసిన యువ ఆయుధానికి నవరాగాలు నేర్పిన
కంటకాయుధం మరి.
కవిత్వమే అనుకున్నా గాని,
కాలాన్ని తిరగరాసే చరిత్ర అనుకోలేదు.
దేహానికంతా అస్థిత్వం దాపురించినా,
వ్యక్తిత్వాన్ని వెలికి తెచ్చిన
ఓ చిన్ని నా అక్షరం ఏరులై పారింది.
భూమ్మీద బతుకు ఈదుస్తున్నాను అనుకున్నానేగాని,
కవిత్వం కొనలను పట్టుకొని వేలాడుతున్నానని అనుకోలేదు.
నాలోంచి కవిత్వం పుట్టింది అనుకున్నానే గాని
నాకున్న లోక అరువులను తీర్చడానికే
కవిత్వం నుంచి నిత్యనూతనంగా,
అవతరిస్తున్నాను అని తెలిసొచ్చింది నేడు!
నా కవిత్వం ఆరని జ్వలనం...

# స్నేహ బంధం

స్నేహితులు ఇద్దరూ విడిపోయారా?
ఎందుకని?
ఓహో! మనసు ముక్కలైందనా?
ఇదొక్కటి చాలదా,
భావాలకు దడి కట్టడానికి?
ఒకే కంచాన్ని పంచుకున్న ప్రేమ,
మొహం తిప్పేస్తుందా?
పోనిలే వాళ్ళే కలుస్తారు.
ఇద్దరి మధ్య యుద్ధం ప్రారంభించింది ఎవరు?
మనుషులా? మనోభావాలా?
రెండూ అయ్యుంటాయి.
తప్పు తనదే అంటే,
చిన్నబోతుంది కాలం
చిరునామా కూడా తెలియదు.
చెలిమి అంత ధృఢంగా అయ్యిందంటే ఏం చెప్తాం?
ఎన్ని కళ్ళు ఎదురుచూసాయో,
స్నేహం విడిపోవాలని.
ఎంత మంది వాంఛో,
గుండెలు ముక్కలు చెయ్యాలని.
వారికపై కలవరన్న మాటే
ఎక్కువగా ప్రచారం సాగుతుంది.
ఇప్పుడు ఫ్రెండ్ నవ్వుతూ ఉంటే
దిగులు సరఫరా అవుతుంది.
నవ్వులు రాలిపడుతుంటే
ముఖం చిన్నబోయేలా చేశారు.
ఛీ ! ఛీ ! ఏం ప్రపంచంరా ఇది,
చిరాకుగా ఉంది చూస్తుంటే!

# వాస్తవం

నేనంటాను,
జీవితం ఒక కొస నుండి
ఇంకొక కొసకి జాలువారుతుందని,
వివాద స్మృతిలో ఉన్న,
విషం ఎక్కువగా తీసుకున్న,
ఉంటానో? పోతానో ?
ఊరికే బుసలు కొట్టే
నేటి సర్పాలను చూస్తే
కుళ్ళిన దృశ్యాలు కళ్ళకి
అడ్డంగా పడుతున్నవి.
ఈ యాదిలోనే నన్ను బతకని,
ఎంతటి నిస్వార్థపు
కథనం కాకపోతే...
ఎక్కిళ్ళు పట్టిన
ఆధునిక కాలానికి అన్నీ తానై
అడుగులు నేర్పాల్సి వస్తుంది
అందుకే...,
నేనంటాను, జీవితం ఒక
కొస నుండి మరొక కొస
వరకు జాలువారుతుందని.
ఈనాటి నా ఈ అక్కరలేని ఊపిరి,
వివాద స్మృతి నుండి
విషాద స్మృతి వరకు.

# అస్థిత్వం

నువ్వు నాతో దేని గురించి ప్రస్తావించకు!
నువ్వు అజరామరం అనుకున్నా.
అయినా, నీ దగ్గర ఎంతసేపు
దాగుడుమూతలు ఆడతాను?
ఎంతసేపని నాటకమాడుతాను?
ఎప్పుడైనా అలసిపోవాల్సిందే!
ఇలాంటి పరిస్థితి నేనెప్పుడు ఎదుర్కోలేదు.
నిన్ను వర్ణించేటందుకు
నా దగ్గర ఏ వర్ణనా లేదు.
ఎందుకంటావా?
నీ గురించి అంతా తెలిసింది.
నువ్వు, ఈ వ్యవస్థ, కుమ్మక్కై
బహుమూతులున్న బహుళజాతి
నిర్వచనాన్ని స్థాపించారుగా.
చాలించు ఇకపై.
ఇప్పుడు, నీ దేహం అంతా
చైతన్యంతో కులుకుతోంది.
నా దగ్గరకు రాకు.
నాకు ఏకాంతమే ఇష్టం.
ప్రపంచపు విషపు కోరల నుండి
తప్పించుకోవడానికి
అలా అలా జారిపోతాను.

# పదిలం

ప్రాణాలకు తెగిస్తున్నావు.
ఎంత తెగించినా,
అప్రయత్న అభివ్యక్తిలో బయటపడతావులే!
భాషాతీత ఈత మనది.
అపాయాలు ప్రకాశిస్తే, మనం చూస్తూ ఉంటాం.
మనిషి జీవితం కదా!
కొన్ని రాగాలు, కొన్ని తీగలు మెడకు చుట్టుకోవాలి
మహాసౌధాలు కూడా నిర్మించలేని
నిరూపయోగమైన సొత్తే నీ ఆస్తి అయితే
మొహం తెల్లబోవాల్సిందే.
యవ్వనం నీ సొత్తు కాదు,
బాల్యం నీ సొంతం కాదు.
అన్నిటికీ అనర్హులం,
బహుశా మనలో ఇంకా
సూర్యుడు ఉదయించలేనట్టున్నాడేమో
నువ్వో హాఫ్ మైండెడ్ ప్రాణివే కాబోలు,
కాని, ప్రాణాలకు తెగిస్తున్నావు.
పోరులో ఓడిపోయినా,
ప్రాణం పదిలంగా ఉంచు.
నీతో విశ్వానికి చాలా అక్కర ఉంది.

# నడుస్తున్న కథ

ఏం జరుగుతుందో ఏంటో?

నాకేమీ అర్థం కావడం లేదు.

ఎన్ని ఆశలో తనపై.

చిన్న అరుపు నుండి ఘర్షణ పుడుతుందా?

ఇప్పుడు తెలిసింది.

ఇన్ని రోజులూ ప్రశాంతంగా సాగిన ఈ ప్రవాహం,

నావల్లేనా అలజడి పాలైంది?

అశ్రువులు జీవనదిగా పరుగులు తీస్తున్నాయి.

ఏంటో నాకు అర్థం కావడం లేదు.

తనది మూగభాష.

ఇసుకను పిసికితే ముద్ద కానట్టు,

హృదయాలు జ్వలించినా,

తనకు మాటలు రావు.

మూగ భాష కాస్త ఆచూకీ తెలియకుండా

గొంతెత్తి గీపెడుతుంది.

చూడాలి... ఇకపై ఏం జరుగుతుందో!

# వేమన నిలయం

ఏం ఇల్లండి అది!
వేమన విజ్ఞాన నిలయంలా ఉంది.
గోడలకు చేదోడుగా ఉండే ఆ ప్రతిభా చిహ్నాలు
ఇంటికి పునర్జీవం ప్రసాదించినట్టుంది.
ఏం కట్టారండి ఇల్లు!
జ్ఞానవేదిక మరి.
ఆయన కళ్ళ తోని కాలాన్ని నెట్టేసి,
కవిత్వం నరనరాల్లో నింపుకున్నాడు.
అనుభవం అట్లాంటిది మరి.
ఏం చెప్తాం, చెప్పేంత వయసా మనది?
విశ్వాన్ని దర్శించిన దేహం
వర్ణనను వాదన చేయగలమా?
అయినా ఆయన ముందు మనమెంత?
ఎక్కడో కవిత్వ శిఖరం పైన ఆయనైతే,
ద్వారం దగ్గర నేను.
అనుభవం అట్లాంటిది మరి.
అయినా ఏం చెప్తాం?
కలాన్ని చూడకపోతే కలవరం.
కవిత్వం రాయకపోతే
కంటికి కునుకు లేని జీవితం.
ఏం చేస్తాం మరి?
జగాన్నంతా జీర్ణించేసుకున్నాడు.
కొన్ని గతాలు రుచిగా లేనట్టున్నాయి
ఇప్పుడే బయటకు కక్కేస్తున్నాడు
అలజడి చేయకండి అదిరిపడతాడు,
కవిత్వంతో కొడతాడు.

# కలవరం

కలవరమా... ఎక్కడిది?
ఏ సంధుల్లోంచి వచ్చింది?
కన్నులకు నేటి జలవ్యవస్థపై ఆగ్రహం కదా!
ఎక్కడినుంచి తీసుకొచ్చారు ఆ నీళ్ళని?
నిశ్శబ్దానికి చోటు లేని ఇంట్లో
కలవరం కరువులా తాండవిస్తుంది.
ప్రపంచం అంతా అతని ఇంట్లోనే పూసినట్టు ఉండేది,
కాని ఇప్పుడు అతని దేహం,
ఇంట్లో నిలువు దోపిడీ చేసింది.
నేనూ వెళ్ళాను పలకరిద్దామని
ఛాయలు అలుముకున్న హృదయాలను పరామర్శిద్దామని.
అప్పుడూ నన్ను ఆ నిశ్శబ్దమే
నేను అర్హురాలిని కాదంటూ వెలివేసింది.
పాపం... పసివాడు ఏమనుకున్నాడో?
ఫ్యాన్‌కు ఉరితాడు మిగిల్చి పోయాడు.
అతడు మేధావే.... కానీ, తెలివికి కూడా
కులమంటూ ఉంటుందని తెలుసుకున్నాడు.
అందుకే అంతటి దుర్ఘటనకు పాల్పపడ్డాడు.
జీవితంతో పోరాడలేక కాదు,
పోరాడేందుకు అర్హత లేక.
అదెప్పటికీ ఆరని ప్రశ్నార్థక జ్వలనం మాత్రమే.
ఈనాటి నిశ్శబ్ద నిరీక్షణే రేపటి మహాశబ్దం.

# రవి కిరణం

వాడు సూర్యుడే.
కాకపోతే ప్రపంచానికంతటికి
వెలుగునివ్వక పోయినా,
ఆదరువు అవుతాడు.
అసహజమైన ఆలోచనలకు,
వెక్కిళ్ళతో అడ్డుకట్ట వేస్తాడు.
ప్రపంచ పద్యానికి వ్యాఖ్యానంలా
వాని మాటలు సాగుతుంటాయ్.
వాడి బాటలోకి నేను కూడా వెళదామంటే
వాడి పద్యానికి గాయమౌతుందేమో!
తలుపు తడదామంటే
పొలమారుతుందేమో మరి.
అసలే అతడు సూరీడు మరి,
భగభగమంటే భస్మం అవుతానేమో!
వెలుగు నింపినవాడు కదా
బూడిద ఎలా చేయగలడు?
నిజంగానే అతడు భానుడు.

# ఎంత మంచి వారండీ మీరు

ఎంత మంచి వారండి మీరు!
చుట్టూ ఎత్తైన ఒంటరితనం ఆవరించినా,
ఏం గాంభీర్యమండీ అది?
లోలోపల సహజత్వాన్ని కోరుకున్నా
బయట కృత్రిమతత్వాన్ని పోషిస్తున్నారు.
విసిగిపోయారా ఏంటి? ఈ వ్యవస్థతో!
కవిగా మారకముందు తాపీగా కూర్చున్నారు
విశ్వాన్ని చదివాక వీరులు అవుదామనుకున్నారు
మీకు ఒదిగిపోవడం తెలుసు,
విజృంభించడం లెక్కనా మీకు?
హరిత స్వప్నాలు ఆత్మాశ్రయంతో అలసిపోయాయిగా.
హఠాత్తుగా అక్కున చేర్చుకున్నారు,
వాటిని నిర్విరామంగా నడుస్తున్న కళల ప్రపంచంలో
మీరో బండరాయిగా ఉంటే ఎలా?
అభిమానులు వస్తున్నారండీ జాగ్రత్త!
కెమెరాలు క్లిక్‌మనిపిస్తారు.
ఆటోగ్రాఫ్‌లు అని వెంబడిస్తారు.
తట్టుకునేలా మనసు మలుచుకోండి,
ధైర్యంతో ఊరేగండి.
ఎంత ధైర్యులండి మీరు!

# అంతా మరిచాడు

మనిషైతే నచ్చజెప్పొచ్చేమో...
ఈ బహుముఖాలున్న విషసర్పానికి ఎలా చెప్తాం?
స్వాభావిక జీవిగా మారిపోయాడు.
ఎంతసేపని నిర్జీవ జీవాలతో ముచ్చటిస్తాడు?
మనిషైతే చెప్పొచ్చు!
మహానుభావుడయ్యాడుగా, ఏం చెప్తాం?
అంతా నీ ముందు గుమ్మరించాలి అన్న తొందర.
ఇంక ఎక్కడ వింటాడు?
కాలేజీ కష్టాలు గుర్తొచ్చినా,
నిరుద్యోగిగా సూర్యాస్తసమయాలు
అర్ధ దశాబ్దంగా వెక్కిరించినా, అతడు వినడు.
గుర్తు తెలియని పాంచజన్యం మరి.
వాడు చేస్తే అది పార్లమెంటు యుద్ధం,
అనామకులు చేస్తే ఉగ్రవాదం మరి!
ఏం చేద్దాం అతన్ని?
బాబా సాహెబ్ లాగా ముచ్చటిద్దాం అతనితో.
గుండెలకు హత్తుకుందాం అతన్ని,
ఆప్యాయంగా మాట్లాడే గాలి తగలకుండా
ఇన్ని రోజులు ఉక్కపోతలో ఉడికిపోయాడు.
కాస్త, కరుణ మంచు వొలికిద్దాం.
వినకపోతే ఏం చేస్తాం?

# చేజారిన గుండెలు

కార్మిక జనాలహృదయాలు
ఎప్పుడో కరిగిపోయాయి
వాటికోసం వేచి చూడకండి
ఆ కార్మికుడు ఒక గ్లోబల్ కవి.
జెండర్లు, వండర్లు అన్నీ కలిపి
ఒక మహాకావ్యంలా
కష్టం రూపంలో ఘల్లుమనిపించడం
వెన్నెతో పెట్టిన విద్య అతనికి.
వెచ్చించడం పోయి వేధింపులు వచ్చాయి.
కష్టాన్ని ఎరుగని కాలం
కుప్పలు–కుప్పలుగా నిప్పును చెరుగుతుంది
చెమట ద్రవీభవించి, చాతకానితనం
చుట్టూ అలుముకుంది.
సర్కారు చుట్టూ తిరిగి–తిరిగి
చేతులకు చిప్పకూడు దిక్కైంది
మళ్ళీ ఇంకోసారి,
మే డే ఫూల్‌గా నిలిచిపోయాడు.
అయినా, ఉద్యమ కంఠాలన్నీ ఒక్కటైతే,
శాసించే చిరంజీవి అతడు.
లెక్కకు రాని ఆ పుట్టు కార్మిక కళాకారుడికి
నమస్కరిద్దాం రండి.

# ఏమోయ్

ఎండమావిలో ఆవిరైపోతుందా ప్రాణం?
ఉష్ణమండలంలో ఉడికిపోతుందా?
గోరంతైనా లేని ఆశయాన్ని ఆదమరచినా,
కళ్ళముందు జిగేలుమంటుంటే,
ఆ తల్లి గుండెలు గుప్పెట్లోనే
ముక్కలు అవుతున్నాయి.
చిక్కుముడిలో చిక్కుకున్నప్పుడు
ఆయుర్వేదానికి అదనపు నిస్సహాయత జోడిస్తావేం?
రెక్కాడిన పక్షిలాగ ఎంతసేపని తిరగాడతావు?
అడ్రస్ లేని నీ ఆలోచన అతిక్రమించకు,
ఆపదలపాలౌతావు.
దిక్కులేక బిక్కుబిక్కు మనుకుంట సూస్తే
కుక్క గూడ కానకచ్చే.
నీది రీఫైండ్ మనసు కాదు,
మలినంతో రీఫౌండ్ మనసు.
అయోడైజ్డ్ హృదయం అయితే
యలు ఊరేగుతాయి.

# జీవనగీతం

చెమట కాలువలు ప్రవహిస్తుంటేనే
చేతులనిండా చదువుండేది.
కడుపు మాడ్చుకుంటేనే
కంచెంలకింత అన్నమొచ్చేది.
రైతులా? ఎక్కడున్నారు?
ఎండమావిలో నీళ్ళు తోడుకుంటున్నారు.
పో....పోయి సూడుపో!!
సలికి ఇంకా దుప్పట్లకు తెల్లార లేదు.
సూర్యుడు వచ్చి పలకరిస్తేగాని
వాళ్ళకి తెల్లవారదు.
పొలంలో పంట పిట్టలు
బుక్కతున్నాయని చెప్పండి.
గుండెల్లోని చెరువు
కనుకొనలలో ప్రవహిస్తుంది.
గర్జించినా భయపడని పొలాలు,
గడ్డిని మేయకముందే
నిద్రనుంచి మేలుకొలపండి!
ఆ మురికి చేతులను ముద్దాడిన ఆ పొలం
పాతాళ గంగను దత్తత తీసుకున్న
ఉదాత్త హృదయాలు అవుతాయి.
పట్టెడు మెతుకులకోసం
రెక్కలు ముక్కలు చేసుకున్న
శ్రమ శక్తులను ఇంకా
నిద్రావస్థ నుండి తీసుకురాలేదంటే,
కళ్ళకాంతులు ఆర్పేసినట్టే.

# ఆమె శేషంకాదు

అమ్మో! ఎన్ని మాటలు నేర్చింది తను
మాటలు ముత్యాలు కావు అన్నప్పుడు
ఆలస్యంగా ఒక ప్రపంచపుష్పం వికసించినట్టు
తన చెక్కిలిపై చిరునవ్వు పూస్తుంది.
ఆగ్రహం అనుకోవాలా?
కన్నీటి జలపాతంతో తాను
నూతన జట్టు కట్టినప్పుడు,
శ్రుతి కలిసినప్పుడు తెలిసింది
మాటంటే ఏమిటో.
తెగిపోతున్న ఊపిరి చెవులోన
సదా మాటలు పారిజాతాలై విచ్చుకునేలా
చెయ్యడం ఆమె నైజం.
ఏ సామి కడుపున పుట్టిందో,
జ్ఞాపకాలవెంట పరుగుతీస్తుంది.
రవి ఆవేశానికి ఓ చిరునవ్వు తగిలిస్తే,
రమ్యంగా అల్లుకున్న ఓ అబద్ధం
సిద్ధార్థుని బోధలాగా పాకుతూనే ఉంటుంది.
మాటలు, మనుషులమధ్య తాను
శేషంకాదు, విశేషం.

# పాడెపై నిద్ర

ఆకలైనప్పుడు బువ్వకోసం లెంకుకుంట
పదిమైళ్ళ దూరం పోతాంటే,
సూశినోళ్ళంత నవుతరు.
గాని కడుపు మంట గానికి కాకపోతే
నవ్వేటోళ్ళకు ఎర్కైతదా?
ఎర్రటెండల చెట్టు కింద రాలిన
ఆకు లెక్క గూసుంటే
కడుపు ఎండిపోతది.
బువ్వకోసం ఇంటికి పోతే
ఇంటికి తాళం ఉంటది.
గుండె చెరువైతది.
కంటికి లీల్లు బంధువులైతయి.
ఎన్ని సార్లు కడుపు మాడ్సుకుండో!
లేతపేగులు, మాడిపోతయేమో?
అడిగితే, ఆకలైతలే అని ఎన్ని రోజులు చెప్తడు.
ఇగ గాపోరగాన్ని ఓళ్ళు అడ్గరు.
ఇంటికి తాళం వడ్డా పట్టింపు లేదు.
ఎందుకంటే గాడిప్పుడు,
ఆకలితోటి అలిగి అలిగి
పాడె మీద పండుకున్నడు.

# స్వార్థపు నీడ

అన్నీ పోగొట్టుకున్నావోయ్!
అనురాగపు చెట్టు నీడ
అడవిలో కూడా కనిపించడం లేదు.
ఏమైనా అంటే, నక్షత్రాలు వెలిగించి
ఆకాశంలో వెలుగు తెస్తానంటున్నావ్.
చిన్నబోయి కూర్చున్న పక్షికి
లేత రెక్కలు మొలిపిస్తానంటున్నావ్.
అన్నీ పోగొట్టుకున్నావోయ్!
అన్నీ భవ బంధాలని నాది అనే ముళ్ళకంపల్లో
ఇరుక్కున్న వైనాన్ని కళ్ళప్పగించి చూస్తున్నావు.
అయినా నువ్వు నిస్సహాయుడివే.
చిక్కుల్లో చిక్కుకున్న దైన్యానివైనావు కదా!
హృదయ విదారక దృశ్యం కనిపించినా,
కంటిని తడిచేసే కరుణాస్వభావివి కూడా కాలేవులె.
ఉత్సాహ ధనస్సును పట్టి
నవజీవన బాణాలను ఇప్పుడైనా వదలవయ్యా.

# అనిద్ర

గగనం నిప్పులుకక్కినప్పుడే అనుకున్నా
నిద్రను తరుముతుందని,
కలలన్నీ రెక్కలు తెగిన పక్షులవలే
తిరగాడుతాయని.
నేననుకున్నా...
కలల కాగితాలపైన ముద్రలు వేస్తుందని.
గురకలు నేర్చిన నిద్ర
అలకలకు స్వాగతం పలుకుతుందని.
నేననుకున్నా...
ఆశలకు అడుగులు నేర్పిన నిద్ర
కలలకు పరుగులు నేర్పుతుందని.
జగమంతా నిద్రావస్థమై ఉంటే,
కన్నులు  మాత్రం ఏం చేస్తాయి?
అడుగులు నేర్చిందిగా పాదం!
ఇకపై ఆగదు.
కాలాన్ని బట్టి కలం పరుగులీడుతుంటే,
కలానికి ఇకపై నిలిపివేత
గుడ్‌నైట్ అని.

# సమాధి స్థలం

బొంద తవ్వడానికి పోతున్నారా?
కొంచెం జాగ్రత్త సుమీ!
ఎక్కడ ఏ రాక్షసుడు నిద్రిస్తున్నాడో?
ఎక్కడ ఏ అనామకుడు పడుకున్నాడో?
ఎవరి నిద్రను భంగపరుస్తుందో,
ఆ గునపపు పోటు?
విశ్వ భారాన్ని మోసిన ఆ కష్టజీవులకు
విశ్రాంతి తీసుకుంటున్న వాళ్ళని
ఏ మొహంతో నిద్రలేపుతారు?
గునపం చేసిన రంధ్రాలకు
ఎంత మంది మేధావులు
జ్ఞాపకశక్తిని కోల్పోతున్నారో
కాస్త చూసుకోండి.
అరె, చెప్పానా!
ఎవరివో కళేబరాలు బయటకు
తొంగి చూస్తున్నాయి.
ఎంతమంది ఆశాజ్యోతో మరి అతను?
అతని గుండెలు చెలించిపోవూ?
ఏ తల్లి దు:ఖ సంద్రమో అది?
సరే, సరే ఎక్కడో అక్కడ పెట్టండి.
కాటి కాపరి జేబు కాస్త తడిపి పోండి.

సద పంగ

# రైతన్నా

రైతన్నా...
ఆకాశంలో అరుణ తార నీవు
భరతమాత జాతిరత్నానివి నీవు
దేశానికి వెన్నుముకవి నీవు
పచ్చటి సైన్యానికి రాజువి నీవు.
నీ సైన్యం నేడు
వరిమల్లలోనే తుదిశ్వాస విడుస్తున్నదా?
దిక్కులేని ఈ వ్యవస్థకు వేగుచుక్కవి నీవు
అలాంటి నీ ఆత్మస్థైర్యం ఆవిరైపోతుందా?
రైతన్నా...
అమీర్‌వు అయిన నీవు గరీబువైతివి.
దానశీలివి అయిన నీవు
దిక్కులేకుండా బతుకుతున్నవు.
ఉరితాళ్ళే నీకు బంధువులైనాయా?
ఎండ్రిన్ గింజలే నీకు మందుబిల్లలైనాయా?
నీ చేతులకు ఉరితాడు ఇచ్చి సాగనంపిందన్నా నీ ఊరు.
రైతన్నా నీవు అమరుడివి.
ఓ అమరుడా, నీకు జోహార్!

# నా పాట

ఈరోజు పాడిన పాట నాదే.
నిన్నటి నా పాట జ్ఞాపకం, ఇవ్వాల్టి కర్తవ్యం.
రెండు పాటలమధ్య రగిలే మౌనం
కదిలే పోరాటం వంటిది.
జీవితం ఒక కొసకు,
జాలువారుతుంది.
ఏదో అభావం...
కృంగుతుందో? కృషించిపోతుందో?
పాత శిథిలాలపైన కురిసిన
ఓ వాన నిలువునా తడిపేసింది.
నిజంగా అది అభావమో? నా పాట స్వభావమో?
నిన్నటి జ్ఞాపకాలను తలచుకుంటూ,
నేటి కర్తవ్యాన్ని నిర్వచించనున్న
నా పాట భావాన్ని కోల్పోలేదు.
అందుకే, ఈ రోజు పాడిన పాట నాదే.

# పునాది

ఈరోజు ఏమైనా,
కారకులు మీరే.
అన్నింటికీ మీపై రుద్దడం అలవాటైంది.
పొరపాట్లు కునికిపాట్లు తీసినా,
మీరే ఆదర్శకులు!
అన్నీ కల్లలు కల్పించడం లేదు.
అజ్ఞానులని అసహ్యించుకోవడం అంతకన్నా లేదు.
చీకటి తీరాలు కాస్త
దారాలై గొంతుకు చిక్కుకుంటే,
గట్టెక్కేందుకు ఒక చింతన మాత్రమే మీరు.
నిర్లక్ష్యం చేసినా,
నిందితుడు అని ముద్రవేసిన కాలం,
నియమాలు లేకుండా మిమ్మల్నే వెతుకుతుంది.
కాస్త కనిపించండి.
తనకి మీరు అవసరం మరి.
ఆదుకునే ఆదర్శ వ్యక్తి మరి.
అందుకే ఈ రోజు ఏమైనా,
మీరే కారకులు మరి!

# కాకా! కాకా!

కాకా... ఏమయ్యింది నీకు?

మూలన పడ్డావని మాట మాట్లాడడం లేదు.

పక్షవాతమా? పక్షపాతమా?

స్వార్ధమా? లేక మాటల స్వీకరణనా?

ఏమయ్యింది నీకు?

ఉలుకూ, పలుకూ లేకుండా అలా ఉన్నావు.

బీటలు వారిన పొలాల్లో పచ్చని బంగారం పండించావు

చేతులు తుమ్మముళ్ళై గుచ్చుకుంటున్నాయి.

ఇదేమైనా నీకు న్యాయంగా ఉందా?

అశ్రువులు నువ్వు తోడిన బావిలో ఊరుతున్నాయి.

అంత కోపం ఎందుకు కాకా నీకు?

ఇది నిద్రా? శాశ్వత నిద్రా?

ఓ అవ్వ..! ఇలా కూర్చో.

కాస్త అశ్రు నివాళి అర్పిద్దువుగాని.

# నవ సమాజం

ఒక అద్భుతమైన ఊహాలోకమిది
రంగులప్రపంచం ఇది
ఎన్ని గాలి మేడలు కడతామో
ఎవరికి తెలుసు!
ఈ రంగులప్రపంచంలో,
ఏ రంగు రాయి చేతికందుతుందో
ఏమో మరి, ఎవరికి తెలుసు!
సేదతీరని బతుకులలో చైతన్యం కనిపిస్తుందని.
భవిష్యత్ చింతనను భావోస్పదంగా పాడేదెవరు?
మార్పు ఇచ్చే అస్పష్టమైన తీర్పు,
కాలాన్ని మార్చలేదు.
పుట్టెడు పేదరికం, పుట్టకముందే వివక్ష!
ఏలనడిచెదవు ఈ వ్యవస్థతో?
కష్టాలు, కన్నీళ్ళు సర్వసాధారణం.
అయితే ఎలా? ఊహాలోకం కదా!
ఏ రంగు రాయి చేతికందుతుందో మరి.

# పాలేరు

గాడు గందుకే పుట్టిండు
దొరగాని కోసమే పుట్టిండు
కాదు, కాదు! గాని కాళ్ళ కింద బత్కనీకే పుట్టిండు.
పిల్లాపాపలను ఇడుసవెట్టి
గొడ్డు శాకిరి చెయ్యనీకే పుట్టిండు
"బాంచెన్ దొర" అని ముంచెతందుకే పుట్టిండు
గాని పోరగాండ్ల పాణం మట్టిలగల్తున్నది
పోరగాండ్లంటే గాన్కి లెక్కలేదు
ఇప్పుడు గాని చేతులు ఉబ్బినయి
ఇప్పుడు గాన్కి తెలిశొస్తది
ఇల్లు ముఖ్యమా! ఇవతలోడు ముఖ్యమా!
అని గతి గింతే.
గాన్కి సావే శరణ్యం ఇప్పుడు.

# డిజిటల్ ప్రపంచం

ఉక్కిరి బిక్కిరి చేస్తున్నా...
ఉక్కని భరిస్తు కిటికీ రెప్పలకు విరామం లేని
నీ ఆయువు విలవిలాడుతుంది.
వెలగని దీపం దగ్గర రెక్కిరిగిన మినుగురు పురుగు
పిచ్చిదై తిరగాడుతుంది.
గాయమైన కలలకు మలాం పూస్తూ కూర్చుంటావు.
డిజిటల్ మిషన్‌లన్నీ కుప్పగా పేర్చినా
నీ దారి కాంతివంతమౌతుందా!
మంచు మైదానంలో నీ అడుగులు
నిశబ్దపు వేదనలు అవుతాయి.
గుండెలనిండా ఊపిరి పీల్చుకున్న నీవు,
గడ్డివాసనకే తలొంచుకుంటావేం?
రక్తమాంసాలు పంచిన నీ తండ్రి
ఇంక తుదిశ్వాస విడుస్తున్నాడు,
మాయా కిటికీల ప్రపంచానికి
కాస్త దూరంగా ఉండవోయ్!



# నా జీవితమిక్కడే...

చచ్చేంత బాధలు లేవు
మిత్రమా, అలాగని
బతికేంత ఆశలు కూడా
లేవు చైతన్యమా!
నటన నేర్చుకొని నీలోకి
నేను ప్రవేశించాను.
కానీ, చిన్ని మనసుకు గాయం
అయితే, నీ పలకరింపు
పులకరింత కాదు నాకు.
చిన్న మనసు కదా,
గాయమైతే దేహం చిట్లిపోతుంది.
నేను భౌతిక రోగిని కాదు,
మానసికంగా కృంగినదాన్ని.
నేను నాస్తికురాలిని కదా,
నమ్మకం పోయింది నీ మీద.
నేటి నా ఈ జీవనం
రేపటితో సుఖాంతం
ఇకపై సెలవు.

# కాకతాళీయం

వీధి వెంట దోసిలి పట్టుకొని తిరిగాను.
ఇన్ని మెతుకులు పడతాయేమోనని
అదేంటో విచిత్రంగా
కొన్ని వాడిపోయిన పువ్వులు
నా చేతిని ముద్దాడాయి.
కళ్లు ఎర్రజేసాయి.
అరె ఆగండి!
అక్కడ ఓడిన బాల్యప్రియులు ఉన్నారు.
అవునా...
ఏం చేస్తున్నారు ఇక్కడ?
బాల్యం యొక్క చిరు గుర్తులను
పరిశీలిస్తున్నారు.
వాడిన పువ్వుల్లో వారి దాగిన
నవ్వుని తిలకిస్తున్నారు.
అరే... ఆగండి,
అడుగు ముందుకు వేస్తే
ఆశలన్నీ ఆవిరి అయిపోతాయి.
అదేంటో విచిత్రంగా
వీధుల్లో తిరిగి సంపాదించిన
వాడిన పూలు,
మళ్లీ వికసిస్తున్నాయి.
ఎందుకో మరి?
చిన్న గుర్తు దొరికిందట.
కారణం, ఏదైతేనేం?
నీరసం నిమిషమే.
నిరుత్సాహం నీకోసమే కావొచ్చు కానీ,
బాల్యాన్ని ఎగరగొట్టడమంటే...
కాకతాళీయమే!

# ఏకాకి

పలుమార్లు చెప్పాను.
వినలేదు.
పరుగులు తీసి ప్రయాసపడ్డాను.
ఫలితం చేతికి చిక్కలేదు.
అలసట కాళ్ళకేమో కానీ,
కళ్ళకు కాదు ఇప్పుడు.
కడుపారా తిందామనుకున్నా,
కన్నీళ్లు తాగి బతకాల్సొస్తుంది.
వేకువజాము వెక్కిరిస్తుంటే,
వెక్కిళ్ళు డ్యాము గేట్లను
ఎత్తి పాడేసాయి.
చీకటి చెరిపేయని చెలిమిని
స్వాగతించాలి.
చెక్కిళ్ళ నిండా నవ్వులని నింపే
మాటలచినుకులు కావాలి నాకు.
మీరు ఇవ్వగలరా?
సరే రండి, కలిసి వెతుకుదాం.
ప్రియతములు,
మా ప్రాణాలు అన్నీ వేచి చూస్తున్నాయి.
ఎక్కడో తెలుసా?
స్మశానంలో!
ఒంటరిదాన్ని కదా.
పలుమార్లు చెప్పినా
ఎవ్వరూ వినలేదు.

# పాంచజన్యం

నిజానికి అతడొక ఆటగాడు.
కాదు... కాదు! చేనేత కళాకారుడు.
మానవాళికి మగ్గం నేసిన
చేనేత చిక్కిపోయాడు.
చూడండి మళ్ళీ
ప్రజానాయకులంటూ వచ్చారు.
వంచించి వంచించి
ఉరితాడు ఎవరి మెడలో
ఉందో చూడ్డానికి వచ్చారు.
అదిగో, కళ్ళు కనిపించలేదా?
నేతన్నను ఏనాడు
చేరదీసాడని వచ్చాడో ఇక్కడకి!
ఇండియాకి ఇరిటేషన్ లేదు.
నాయకులకి ఫ్రస్టేషన్ లేదు.
ఇంకెందరు నేలను ముద్దాడనున్నారు?
ఒంట్లో ఉక్రోషం ఊరేగుతుంది.
నేతన్న దేహం చెట్టుకు వేళాడుతుంది.
చచ్చినా, నేసినా, కోసినా మేసినా,
అతనొక కళాకారుడే.

# నిజమే

నిజమే
కుప్పలు - కుప్పలుగా రాలిన
అనుబంధాలు, అదృష్టమో
దురదృష్టమో, అక్కడే
నేలను ముడతాయి.
కించిత్తు ఆశ్చర్యం లేని
ఈ శునకానికి నా శరణం.
ఆలోచించం గానీ, అంతా
ఆమాత్యులే. యేళ్ళ నుంచి
ఇగురు పెట్టిన ఇల్లు
ఇంకాస్త కొత్త రంగులు తొడిగింది.
ఇప్పుడే ప్రాణం పోసుకున్న
పిల్ల రాగాలు, ఏ సందుల్లోంచో
వచ్చి నన్ను హత్తుకుంటున్నాయి.
రోజూ కొత్తదనమే.
గతాలనాటి గమ్యం మాత్రం
చెరగకుండా, కదలకుండా అలానే
అస్థిత్వం సంతరించుకుంది.
మాయున్న చూపులు ఎందుకో
నన్ను మోసేస్తున్నాయి
ఇంకా నయం, కాలం మారింది.
లేదంటే కనుమరుగయ్యేదాన్నేమో!
నిజంగానే, నిన్ను చూస్తున్న
నా కళ్ళకి కాలం మార్పుతో
పాటు పొరలు అల్లుకున్నాయి.
అయినా, ఈ శునకానికి ఆశ్చర్యం లేదు.

# కాలుక్యులేషన్

ఎన్ని సంవత్సరాలు
బ్రతుకుదామనుకుంటున్నారు?
వందేళ్ళు?
కాలుక్యులేషన్ బాగానే ఉంది.
నువ్వో ఎండేంజర్డ్ ప్రాణివి కదా,
నీ మనసు నిండా
పల్లేరు కాయలు రాలుతున్నాయి.
ఎంత జాగ్రత్తగా నడిచినా,
భావాలకు గాయాలు తప్పవు.
నువ్వో స్నిగ్ధ శిల్పివే కావొచ్చు
నీటి బిందువులపై శిల్పాలు చెక్కొచ్చు.
నీ ఎదురు చూపులకు
కళ్ళు ఎండిపోవడం ఖాయం.
కష్టం అనుకుంటే కాలం
కక్కుర్తి పడుతుంది.
ఏమో చెప్పలేం!
వందేళ్లు బతుకుదామనుకుంటున్నావు.
అయినా, ఈ దుర్మార్గపు దృష్టి
నీపై కాలకూట విషం చల్లుతుంది.
అప్పుడు నీ ఉనికిని నిశ్శబ్దం
చేరదీస్తుంది.

# శేషం

జీవిత శిథిలాల్లో చూడడానికి
ఏమీ మిగలక పోవచ్చు
పెదవిరుపులు, మనస్తాపాలు
పాడెకట్టే పెడర్థాలు, తప్పించి,
ఇన్ని రోజులు అప్పుడు అంటూ
అక్కున చేర్చుకున్నాడు
ఇప్పుడు నిందితుడు అతడు.
అతడి కోసం ఎవరూ
రావలసిన అవసరం లేదు
చీకటి నిండిన భావాలు
చాలానే ఉన్నాయి,
అతని గురించి కన్నీళ్ళు
కార్చడానికి.
బిక్క మొహం వేసుకొని
బెంగ పెట్టుకుంటే
కొత్త మానసిక తెరలు దించాల్సిందే.
కొత్త వేదాంతాన్ని ప్రకటించాడు
తప్పు అతనిది ఏమీ కాకపోవచ్చు,
కానీ, తన మనస్సు మాత్రం దోషి.
ఇకపై అతడి మాటలు అనివార్యం.
మాటలనే పాటలు చేసి
పదబంధాలు అల్లుతాడు.
బరువులు మోసి అలసిన జీవితం,
బాధ్యతను నేర్పడం నేర్చుకున్నాడు.
ద్రోహం చేసారుగా నీకు,
నమ్మబోకు.
ప్రాలాపనలు ఇకపై ఆపకపోతే
జీవిత శిథిలాలు తప్ప ఏమీ
మిగలవు.

# రోప్‌వే

వర్షపు ధారలకు రోప్‌వే చీలిందట.
ప్రవాస భారతం వలస పోయిందట.
అకథలు శూన్యాన్ని అల్లుకుంటే,
కథలు కళ్ళు దాచుకుంటాయి.
ఓ వేదనా!
నీకెందుకు కళ్ళమీద అంత ఆధిపత్యం.
ఎప్పుడూ కంటినీరును
బెదిరించి వెంటబెట్టుకెళ్తావు.
పైశాచికమో, దాతృత్వమో,
నిన్ను వర్ణించడానికి నా దగ్గర
ఏ వర్ణన లేదు.
నా కఠిన హృదయాన్ని,
కరిగిస్తావని అనుకున్న,
మళ్ళీ కుదుట పడొచ్చులే అని వదిలేసా.
కానీ, ఇప్పుడు అర్థమైంది
ముక్కలు చేసినా అతనిని
ఆముఖ వస్తువును చేశావని.
కల్పితం నీ కంఠంలో
ప్రవహించినప్పుడు,
కాలు దువ్వడానికి నేను నీతో
'సై' అనలేను.
నువ్వు నా కోసం వేసిన
రోప్‌వే చీలింది.
మంచి బహుమతి ఇచ్చావు,
ధన్యవాదాలు మిత్రమా!

# నా కవిత్వం

అది కాలం అయితే ఏంటి?
కవిత్వం ముందు అన్నీ బలాదూర్.
లోకానికి నేను కొన్ని
కలల కాంతులు అప్పుగా ఉన్నాను.
గుప్పెడు అక్షరాలను పట్టుకొని
ప్రయాణం ప్రారంభించా
మెట్టప్రాంతాల్లో మట్టెల రవళికి
కవిత్వం ఎగిసిపడుతుంది.
అలసిన యువ ఆయుధానికి నవరాగాలు నేర్పిన
కంటకాయుధం మరి.
కవిత్వమే అనుకున్నా గాని,
కాలాన్ని తిరగరాసే చరిత్ర అనుకోలేదు.
దేహానికంతా అస్థిత్వం దాపురించినా,
వ్యక్తిత్వాన్ని వెలికి తెచ్చిన
ఓ చిన్ని నా అక్షరం ఏరులై పారింది.
భూమ్మీద బతుకు ఈడుస్తున్నాను అనుకున్నానేగాని,
కవిత్వం కొనలను పట్టుకొని వేలాడుతున్నానని అనుకోలేదు.
నాలోంచి కవిత్వం పుట్టింది అనుకున్నానే గాని
నాకున్న లోక అరువులను తీర్చడానికే
కవిత్వం నుంచి నిత్యనూతనంగా,
అవతరిస్తున్నాను అని తెలిసొచ్చింది నేడు!
నా కవిత్వం ఆరని జ్వలనం...

# మార్పు

అరే అన్నా! పిలుస్తూ ఉంటే వినపడడం లేదా?
ఇందుముఖుడా! ఆలోచనలు ఎటు?
ఓ చరిత్రకెక్కిన చరిత్రార్థుడా! పయనమెటు?
అడుగు తడబడినా అలజడి లేదంటే,
అస్పృహలో ఉన్నావన్నట్టే కదా.
ప్రాణం పోయేటట్టున్నా, పాదం నిలవలేదంటే,
పరుగులు ఖాయమనేగా.
పట్టిపీడిస్తున్న పురుగులను
పలకరించడానికి వెలుతున్నావో,
పోరాటానికే సిద్ధమౌతున్నావో,
నీ కపట కనీళ్ళు నిన్నే మోసం చేస్తున్నప్పుడు
పరులకేమెరుక నీ కన్నులగురించి?
ఆయుధాగారాలలో ఆయువు తరుగుతున్నా,
ఆశాజ్యోతులు వెలిగిస్తున్నావంటే,
అమరుడివి నువ్వు.
ఇకపై ఊపిరి పీల్చేందుకు కారణం నువ్వు
అంటే పునాది నీవేగా.
పాత లోకంకేలి అచ్చినా,
పురుషోత్తముడివి అయినావంటే
చేతులు జోడించాల్సిందే.

# మనుజుడు

భయపడుతున్నారా?
ఎందుకని? ఏం జరిగిందని?
ఆ మాట మాత్రం అనకు,
వెన్నులో పిడిబాకు వేసినట్టుంది.
మీ మనసు మంచిదేగా!
మాలిన్యం లేని మెదడేగా!
చనుపాలను అనుదెంచినా,
వనకని ప్రాణివి కదా నువ్వు.
భయమెందుకు!
ఏంటీ, మనసు కొంచెం భారంగా ఉందా?
ఇప్పుడే కదా భయం అన్నావు,
మళ్ళీ బాధంటావు?
ఆదర్శానికి దాసోహమా నువ్వు,
లేక బానిసవా? ఏమో!
నీ గురించి ఏం చెప్పాలన్నా
మనసు కరుణా సముద్రంలో ఈత కొడుతుంది.
అమాయకుడివో? ఆప్తుడివో?
అనుభవజ్ఞుడివో? అపరచాణక్యుడివో?
ఏది చేసినా భయం అంటావు.
కాసేపైతే రెక్కలు మొలిచిన పక్షిలాగా గంతులేస్తావు
బలశాలివో? బలహీనుడివో?
పొగిడితే భయం అంటావు.
తిడితే బాధ అంటావు.
ఓహో! మానవాళికి చెందిన వాడివా నీవు?
అర్థం అయ్యింది.
అయితే నేను నిన్ను పట్టించుకోను.

సద పంగ

# ఆమె చూపు

ఆమె నీవైపే చూస్తుందా?
నీలో ప్రపంచాన్ని చూస్తుందా?
అర్థంకాని దృశ్యాలతో ఆగమైన కళ్ళు
మరింత లోతుకు దిగిన చూపులు
అన్నీ అనర్థంగా ఆవేశం పాలయ్యాయి.
సజీవ సజల మహాకావ్యంలా కనిపించిన ఆ చూపులు
కారు చీకట్ల పాలౌతున్నాయి.
తన కళ్ళల్లో కలల పారిజాతాలు
పసి పాపలా తుళ్ళుతున్నప్పుడు,
తన్మయత్వం చిందించిన ఆమె
తన చూపుల సూదులతో గాయపరిచినపుడు,
విమానం కూడా కీటకమవుతుంది.
తను నన్ను చూసే చూపుకు,
ప్రపంచాన్ని చూసే చూపుకు పొంతనే లేదు.
చూపులు లేని కళ్ళు తనవి కాదని తెలిసినా,
జ్ఞాపకాలన్నీ పిండినా, చుక్క రాలని
ఆ జలవ్యవస్థపై ఆగ్రహం చెంది,
నీ వైపే తన పరుగు కొనసాగేది.

**Sada Panga** is a student and a poet. Hailing from Annaram, Kamareddy District, Telangana. Sada is currently pursuing B.A. 1st year at TSWRDC, Nizamabad. Her work sets forth a trajectory for many young thinkers who wish to be heard and seen. She engages her readers with the most fundamental questions and thoughts about strengths and vulnerabilities of human condition. The very language she employs in each of her poem revel in brilliance its authenticity, irony and simplicity is no less captivating.



Sada Panga

"This is an Amazing work. Her poems look so mature and meaningful. She will become agreat writer like Maya Angelou and Tony Morrison."

- **Dr. R.S. Praveen Kumar**
Secretary, TSWREIS

## Editor's Acknowledgements

Our deep gratitude to Dr. P. Sneha Latha, Principal, TSWRDC Nizamabad, for her unflinching encouragement towards all the literary activities we undertake to help students discover their creative potentials.

Special thanks to Mr. Ravi Prasad, R.K Digitals, Nizamabad for being a constant support throughout this endeavor. Without their timely help at every stage, this book wouldn't have come out this successfully.

Edited and Introduced by
**Sandhya Deepthi. K**